క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మునుగోడు: మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త పసునూరి శంకరయ్య శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియల నిమిత్తం రాజగోపాల్ రెడ్డి పంపిన రూ. 20వేల నగదును కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. అంతుకు ముందు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దండు లింగస్వామి, చిలుకరాజు శంకరయ్య. సీపీఐ నాయకుడు మందుల పాండు తదితరులు పాల్గొన్నారు.

ఓటెత్తిన ఉత్సాహం

కేతేపల్లి: పోలింగ్ రోజు మండలంలోని వివిధ గ్రామాల్లో ఓటు వేసేందుకు జనం పోటెత్తారు. ఈ ఎన్నికల్లో మండలంలో 87.70 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 30,470 మంది ఓటర్లు ఉండగా 26,750 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో మహిళలు 13,371 మంది, పురుషులు 13,379 మంది ఉన్నారు. అత్యధికంగా ఉప్పలపహాడ్ 91.53 శాతం ఓటింగ్ నమోదు కాగా అత్యల్పంగా భీమారం గ్రామంలో 84.24 శాతం ఓటింగ్ నమోదైంది.

బాధ్యత మరువక ఓటేశారు



ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో వస్తున్న వృద్ధుడు (ఫైల్)

కేతేపల్లి: తమకెందుకులే అనుకోకుండా వయసు పైబడిన వృద్ధులు సైతం ఓటు వేసి తమ బాధ్యతను నెరవేర్చారు. గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేతేపల్లి మండలంలో యువతతో పాటు చేతకాని వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నడవలేని స్థితిలో ఉన్న వారు సైతం తమ కుటుంబ సభ్యులు, ఇతరుల సాయంతో వచ్చి ఓటు వేశారు. అదేవిధంగా పోలింగ్ శాతం పెంచడంలో భాగంగా ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన సౌకర్యాలు ఓటర్లకు ఎంతో ఊరటనిచ్చాయి. ఓటు వేయటానికి వచ్చే వారికి వాహన సౌకర్యం, పోలింగ్ కేంద్రంలో వీల్‌చైర్, సహాయకుల ఏర్పాటు, దివ్యాంగులు కేంద్రానికి రాగానే వలంటీర్లు ఓటువేసే వరకు జాగ్రత్తలు తీసుకున్నారు.

జూనూతుల గట్టులో హనుమాన్ భక్తుల రద్దీ



గట్టుపై పూజలు చేస్తున్న భక్తులు

గుర్రంపోడు : మండలంలోని జూనూతుల గ్రామంలో గట్టుపై ఆంజనేయస్వామి విగ్రహాలు ఇటీవల బయటపడటంతో భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తుతున్నారు. గ్రామంలోని హనుమాన్ భక్తులకు గుట్టపై హనుమాన్ విగ్రహాలు ఉన్నట్లు కలలో రావడం, గుట్టపై విగ్రహాలు బయటపడడంతో దీంతో పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యతో భక్తులు రోజూ గట్టుపైకి చేరుకుని పూజలు చేస్తున్నారు. గట్టుపై అంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించాలని వారు కోరుతున్నారు.


చెట్ల చుట్టూ తోడేస్తున్నారు!



కొంపల్లి పెద్దచెరువులోని తుమ్మ చెట్ల చుట్టూ తవ్విన మట్టి

- నీరు అందక ఎండిపోతున్న చెట్లు

మునుగోడు: పచ్చగా నిగనిగలాడే చెట్ల చుట్టూ మట్టిని తవ్వుతుండడంతో వాటికి నీరు అందక ఎండిపోతున్నాయి. మునుగోడు మండలంలోని కొంపల్లి గ్రామం పెద్ద చెరువులో దాదాపు 300లకుపైగా తుమ్మ చెట్లు ఉన్నాయి. ఇటీవల చెరువులోని మట్టిని కొందరు వ్యాపారులు అధికారుల అనుమతి లేకుండా జేసీబీలతో తవ్వి టిప్పర్ల ద్వారా రోడ్లకు, ఇతర నిర్మాణాలకు సరఫరా చేస్తున్నారు. చెట్ల చుట్టూ దాదాపు 20 ఫీట్ల ఎత్తులో మట్టిని తవ్వడంతో వాటికి అవసరమైన నీరు అందక నిలువునా ఎండిపోతున్నాయి. అలా ఇప్పటి వరకు చెరువులో దాదాపు 50కిపైగా చెట్లు చనిపోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి మొక్కలు నాటి పెంచుతుంటే, కొందరు ఉన్న చెట్లని చంపివేయడం ఎంత వరకు సబబని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని చెరువులోని మట్టిని తరలించకుండా అడ్డుకోవాలని కోరుతున్నారు.



చుట్టూ మట్టి తవ్వడంతో ఎండిపోయిన తుమ్మచెట్టు

పచ్చల సోమేశ్వరాలయంలో కాంగ్రెస్ నాయకుల పూజలు



పూజలు నిర్వహిస్తున్న నాయకులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పానగల్లు పచ్చల సోమేశ్వరాలయంలో కాంగ్రెస్ నాయకులు శనివారం పూజలు నిర్వహించారు. ఆలయంలోని శివుడికి అర్చన, రుద్రాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవాలని, ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో డైరెక్టర్ ఈసం లింగయ్య, రిటైర్డ్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ బుర్రి కృష్ణశేఖర్, జంగయ్య, కొడెల లింగయ్య, పల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, జీవన్‌కుమార్, బుర్రి మహేష్‌కుమార్, ఓర్సు పాండు, గుండెగోని శ్రీనివాస్, రుద్రాక్ష సోమయ్య, ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెద్దవూర: మండలంలోని పెద్దగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నగూడెం గ్రామానికి చెందిన, పెద్దవూర ఎంపీడీవో కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి కురాకుల రామలింగయ్య(57) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి చిన్నగూడెంలోని ఆయన నివాసానికి వెళ్లి రామలింగయ్య మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట ఎంపీపీ చెన్ను అనురాధసుందర్‌రెడ్డి, సర్పంచ్ కూన్‌రెడ్డి మల్లారెడ్డి, లింగయ్య, సుంకిరెడ్డి సంజీవరెడ్డి, బెడుదూరి వెంకట్‌రెడ్డి, పవన్ తదితరులు ఉన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

మిర్యాలగూడ లెక్కింపు 19 రౌండ్లు

మిర్యాలగూడ : మిర్యాలగూడ నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆదివారం నల్లగొండలో ఉదయం 8గంటల నుంచి ప్రారంభం కానుంది. 19రౌండ్లలో రౌండ్‌కు 14 పోలింగ్ బూత్‌ల చొప్పున కౌంటింగ్ ప్రక్రియ కొనసాగనుంది. మొదటి రౌండ్‌లో.. పాముల పాడు బూత్ నంబర్లు – 1, 2, 3, పోరెడ్డిగూడెం పీఎస్ 4, చిరుమర్తి 5,6, గుర్రప్పగూడెం 7, భీమనపల్లి 8, ఆగామోత్కూర్ 9, 10, బొమ్మనకల్ 11, పుచ్చకాయలగూడెం 12, తోపుచర్ల 13,14 లెక్కించనున్నారు. రెండో రౌండ్‌లో.. ఇసుకబావిగూడెం బూత్ నంబర 15, సల్కునూరు 16, 17, మంగాపురం 18, కల్వలపాలెం 19, ఎరుకలగుట్ట 20, ఆమనగల్లు 21,22, లక్ష్మీదేవిగూడెం 23, రావులపెంట 24, 25, 26, కామేపల్లి 27, మొల్కపట్నం 28 బూత్ ఈవీఎంలను లెక్కించనున్నారు. మూడో రౌండ్‌లో.. మొల్కంపట్నం 29, శెట్టిపాలెం 30, 31, 32, 33, తిమ్మారెడ్డిగూడెం 34, వేములపల్లి 35, 36, 37, 38, 39, కుక్కడం 40, 41, 42 బూత్ ఈవీఎంలను లెక్కించనున్నారు. నాలుగో రౌండ్‌లో.. గంధ్రవానిగూడెం 43, బుగ్గబావిగూడెం 44, అన్నపరెడ్డిగూడెం 45, మిర్యాలగూ టౌన్ విద్యానగర్ 46, 47, 48, 49, 50, హౌసింగ్‌బోర్డు 51, 52, గాంధీనగర్ 53, 54, 55, కలాల్‌వాడ 56 బూత్‌లవి లెక్కించనున్నారు. ఐదో రౌండ్‌లో..మిర్యాలగూడ టౌన్ కలాల్‌వాడ 57, సుందర్‌నగర్ 58, 59, 60, రైతువేదిక మిర్యాలగూడ 61, తాళ్లగడ్డ 62, షాబునగర్ 63, 64, తాళ్లగడ్డ 65, 66, రాంనగర్ 67, 68, 69, షాబునగర్ 70 బూత్‌లవి లెక్కించనున్నారు. ఆరో రౌండ్‌లో.. మిర్యాలగూడ టౌన్ నందిపాడు 71, 72, సీతారాంపురం 73, 74, 75, బీసీ హాస్టల్ 76, 77, 78, సీతారాంపురం 79, 80, శాంతినగర్ 81, ఎస్‌సీ క్యాంపు 82, 83, శాంతినగర్ 84 బూత్‌లవి లెక్కించనున్నారు. ఏడో రౌండ్‌లో.. మిర్యాలగూడ టౌన్‌శాంతినగర్ కమ్యూనిటిహాల్ 85, బకల్‌వాడ 86, సంతోష్‌నగర్ 87, బకల్‌వాడ 88, 89, 90, కృష్ణకాలనీ 91, అశోక్‌నగర్ 92, 93, 94, హనుమాన్‌పేట 95, 96, నాగార్జునసాగర్ 97, 98 బూత్‌లవి లెక్కించనున్నారు. ఎనిమిదో రౌండ్‌లో.. మిర్యాలగూడ టౌన్ నాగార్జునసాగర్ 99, రెడ్డికాలని 100, 101, 102, 103, చర్చిరోడ్డు 104, వడ్డెరగూడెం 105, 106, 107, ఇందిరమ్మకాలనీ 108, 109, ఇస్లాంపురం 110, 111, 112 బూత్‌లలో లెక్కించనున్నారు. తొమ్మిదో రౌండ్‌లో.. మిర్యాలగూడ టౌన్ చైతన్యనగర్ 113, 114, బంగారుగడ్డ 115, మినా కళాశాల 116, బంగారు గడ్డ 117, 118, 119, 120, 121, మినా కళాశాల 122, ఏడుకోట్ల తండా 123, ఈదులగూడెం 124, 125, 126 లెక్కించనున్నారు. పదో రౌండ్‌లో ఈదులగూడెం 127, ప్రకాశ్‌గర్ 128, 129, 130, 131, గోగువారిగూడెం 132, నందిపాడు 133, 134, రవీంద్రనగర్‌కాలనీ 135, గోపసముద్రం తండా 136, వాటర్‌ట్యాంక్ తండా 137, ఐలాపురం 138, కుంటకిందితండా 139, చిల్లాపురం 140 లెక్కించనున్నారు. 11వ రౌండ్‌లో.. శ్రీనివాస్‌నగర్ 141, 142, తుండపాడు 143, 144, సామేగాని తండా 145, లావూడితండా 146, తుంగపాడు 147, వెంకటాద్రిపాలెం, 148, జంకుతండా 149, వెంకటాద్రిపాలెం 150, జంకుతండా 151, వెంకటాద్రిపాఎలం 152, జప్తివీరప్పగూడెం 153, భల్లునాయక్‌తండా 154 బూత్‌లవి లెక్కించనున్నారు. 12 రౌండ్‌లో.. సీత్యాతండా 155, అన్నారం 156, 157, చింతపల్లి 158, 159, 160, 161, యాద్గార్‌పల్లి 162, 163, 164, కాల్వలపల్లి 165, 166, ఉట్లపల్లి 167, 168 వి లెక్కించనున్నారు. 13 రౌండ్‌లో.. ఉట్లపల్లి 169, నర్సింహులుగూడెం 170, తక్కెళ్లపాడుతండా 171, తక్కెళ్లపాడు 172, 173, దొండవారిగూడెం 174, 175, తడకమళ్ల 176, 177, 178, బాదలాపురం 179, అవంతీపురం 180, 181, ఆలగడప 182 బూత్‌లవి లెక్కించనున్నారు. 14వ రౌండ్‌లో.. సుబ్బారెడ్డిగూడెం 183, 184, 185, రాయినిపాలెం 186, 187, జాలుబాయి తండా 188, ముల్కలకాల్వ 189, గూడూరు 190, 191, బోట్యానాయక్ తండా 192, కిష్టాపురం 193, రుద్రారం 194, కొత్తపేట 195, లక్ష్మీపురం 196వి లెక్కించనున్నారు. 15 రౌండ్‌లో.. కొత్తగూడెం 197, 198, హట్యాతండా 199, కేశవాపురం 200, నూనావత్ తండా 201, మాన్‌తండా 202, జైత్రాంతండా 203, తెట్టెకుంట 204, కొండ్రపోల్ 205, బానావత్ తండా 206, కొండ్రపోల్ 207, రాళ్లవాగుతండా 208, పార్వునాయక్‌తండా 209, బాలాజీనగర్‌తండా 210 బూత్‌లను లెక్కించనున్నారు. 16వ రౌండ్‌లో.. గాంధీనగర్ 211, దిలావర్‌పూర్ 212, 213, కేజేఆర్ కాలనీ 214, దూద్యాతండా 215, బొత్తలపాలెం 216, 217, కల్లెపల్లి 218, 219, తిమ్మాపురం 220, పుట్టలగడ్డ 221, సర్సాపూర్ 222, 223, దామరచర్ల 224 బూత్‌లవి లెక్కించనున్నారు.

17వ రౌండ్‌లో..
దామరచర్ల పీఎస్ 225, 226, రాజగట్టు 227, దామరచర్ల 228, 229, 230, వాచ్యా తండా 231, బొత్తలపాలెం 232, గణేశ్‌పాడు 233, వాడపల్లి 234, 235, 237, 238 బూత్‌లవి లెక్కించనున్నారు.
18వ రౌండ్‌లో..
ఇర్కిగూడెం 239, 240, తాళ్లవీరప్పగూడెం 241, 242, వీర్లపాలెం 243, 244, 245, శాంతినగర్ 246, ఉల్సాయిపాలెం 247, 248, అడవిదేవులపల్లి 249, 250, 251, 252 బూత్‌లవి లెక్కించునున్నారు.
19వ రౌండ్‌లో..
మూదిమాణిక్యం 253, జిలకరకుండ తండా 254, చాంప్లాతండా 245, కొత్తనందికొండ 256, మొల్కచర్ల 257, బంగారు కుంట తండా 258, బాల్నెపల్లి 259, 260, చిట్యాల 261, సారెగూడెం 262, నడిగడ్డ 263 బూత్‌లను లెక్కించనున్నారు.

నకిరేకల్ విజేత ఎవరో!

- నేడు తేలనున్న భవితవ్యం
- మూడు దఫాలుగా వారు ఇద్దరే ప్రత్యర్థులు
- గెలుపుపై ఇరుపార్టీల ధీమా



దుప్పలపల్లి గోదాంలో కౌంటింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

నకిరేకల్: నకిరేకల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా విజయం సాధించేంది ఎవరో ఆదివారం మధ్యాహ్నం లోపు తేలనుంది. నల్లగొండలోని దుప్పలపల్లి ఎఫ్‌సీఐ గోదాంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. మూడు దఫాలుగా వారు ఇద్దరే ప్రత్యర్థులుగా పోటీ పడుతున్నారు.. నకిరేకల్ నియోజకవర్గ ఎన్నికల పోరు రసవత్తరంగా జరిగాయి. మొత్తం 23 మంది అభ్యర్థులు బరిలో ఉండగా ప్రధానంగా రెండు పార్టీల మధ్య పోరు నువ్వా... నేనా అన్నట్లు సాగింది. ఈ ద్విముఖ పోటీలో విజేత ఎవరనేది ఉత్కంఠ నెలకొంది.

ఈ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం..
ఎస్సీ రిజర్వ్ అయిన నకిరేకల్ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. గత 3దశాబ్దాల పైనే సీపీఎం ఆదిపత్యం చెలాయించిన ఈ నియోజక వర్గం గత 2009 ఎన్నికలలో కాంగ్రెస్ వశమైంది. ప్రస్తుతం 2014లో టీఆర్ఎస్ దక్కించుకుంది.మళ్లీ 2018లో కాంగ్రెస్ గెలిచింది. ఆతరువాత కాంగ్రెస్ నుంచి గెలిచిన చిరుమర్తి లింగయ్య బీఆర్ఎస్‌లో చేరి బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచారు.2018లో టీఆర్ఎస్ నుంచి పోటి చేసి ఓటమి పాలైన వేముల వీరేశం తాజా ఎన్నికల నోటిఫికేషన్ తరువాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి పోటిలో ఉన్నారు.. ఏది ఏమైన గెలుపు ధ్యేయంగా ఇద్దరు అభ్యర్థులు దీమాతో ఉన్నారు.. ..2014 ,2018 ఎన్నికల్లో కూడ వీరే ప్రత్యర్థులు.మొత్తం 23 మంది బరిలో ఉండగా ప్రధానం బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య నువ్వా నేనా అన్నట్లు పోటీ నెలకొంది.

ఓటు వేసిన వారు 2,17,149 మంది
నియోజకవర్గ ంలోని నకిరేకల్ ,చిట్యాల, కేతేపల్లి, రామన్నపేట, కట్టంగూరు, నార్కట్‌పల్లి మండలాల్లో ప్రస్తుతం మొత్తం ఓటర్లు 2,50,547 మంది ఉన్నారు. వీరిలో 2,17,149.మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.. మొత్తం 86.67 శాతం పోలింగ్ నమోదు అయింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా మరో 1914 మంది ఓటు వేశారు. .2009 ఎన్నికల్లో 76 శాతం నమోదు కాగ 2014 ఎన్నికల్లో 78.98 శాతం..2018లో 88.49 కి పెరిగింది. 2023లో 86.67 కే సరిపెట్టుకుంది. అభ్యర్థుల గెలుపు, ఓటమిలపై ఎలా ప్రభావం చూపనుందో ప్రధాన పార్టీలు అంచనాలు వేసుకుంటున్నారు.

బరిలో 23 మంది

నకిరేకల్ నియోజకవర్గం నుంచి పోటీలో 20 మంది అభ్యర్థులు ఉన్నారు. చిరుమర్తి లింగయ్య (బీఆర్ఎస్) వేముల వీరేషం (కాంగ్రెస్), నకిరేకంటి మొగిలయ్య (బీజేపీ), బొజ్జ చిన వెంకులు (సీపీఎం), మేడి ప్రియదర్శినిరాణి (బీఎస్పీ), నూనె వెంకటస్వామి (బీఎల్ఎఫ్), పురం సంతోష్ కుమార్ (మన తెలంగాణ రాష్ట్రీయ సమాఖ్య), మేడి నరేష్, (సోషల్ జస్టిక్ పార్టీ ఆఫ్ ఇండియా), మేడి సంతోష్ (తెలంగాణ రిపబ్లికన్ పార్టీ), పందిరి విజయ్‌కుమార్ (యుగతులసి పార్టీ), పూర వేణు (జన శంఖారావం), యాతాకుల వెంకన్న (ధర్మసమాజ్ పార్టీ), ఇండిపెండెంట్లుగా కట్ట శ్రీనివాస్, కదిరే కిరణ్‌కుమార్, బోడ అశ్వీర్‌కుమార్, గంటెపాక స్వామి, పనికెర లోకేష్, పెద మాయ మధు, బండారి రాజు, సింగపాక సురేష్, కుందకురి నరేష్, కోమ్ము శోభారాణి, చింత మల్ల రాంబాబులు బరిలో ఉన్నారు.

కౌంటింగ్‌పై ఉత్కంఠ !

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 3వ తేదిన ఓట్ల లెక్కింపులో భాగంగా తొలి కౌంటింగ్ మిర్యాలగూడ నియోజకవర్గానిదే కావడంతో ఉత్కంఠ నెలకొంది. దీంతో ప్రధాన పార్టీలు అయినా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తల్లో టెన్షన్ ప్రారంభం అయింది. ఎక్కడ చూసినా కూడా బీఆర్ఎస్ గెలుస్తుందని ఆ పార్టీ కార్యకర్తలు. కాదు కాంగ్రెస్ పార్టీనే గెలుస్తుందని ఈ పార్టీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. అదే విధంగా మేధావులు, ఉద్యోగులు, యువకులు మాత్రం ఏ టీ స్టాల్ వద్ద ఉ0న్న గెలుపు ఓటములపైనే ప్రధాన చర్చ సాగుతుంది. కాగా అభ్యర్థులకు ప్రధాన శ్రేణి నాయకులు ఇచ్చిన రిపోర్ట్ ఒకటి అయితే ద్విశ్రేణి నాయకులు ఇచ్చిన రిపోర్ట్ ఒకటిగా ఉండటంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నువ్వా, నేనా అనే విధంగా ఉండగా ఆ పార్టీ నుంచి ఈ పార్టీలోకి.. ఈ పార్టీ నుంచి ఆ పార్టీలోకి వచ్చిన కార్యకర్తలతోనే ఆందోళన నెలకొంది. కాగా కొంత మంది రెండు పార్టీల గెలుపు ఓటములపై బెట్టింగ్‌లను కూడా పెట్టారు. అయితే నల్లగొండ జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను తొలి ఫలితం మిర్యాలగూడ కావడంతో ఈ ఉత్కంఠకు ఒంటిగంటలకు తెరపడనున్నది.

కాంగ్రెస్‌లో ‘సన్నాఫ్ సీనియర్లు’

- ఆకట్టుకున్న యువ నాయకుల ప్రచారం
- ఫలితంపై సర్వత్రా ఆసక్తి



కుందూరు జయ్‌వీర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వల్లభరెడ్డి, మేరెడ్డి వెంకట్, కుందూరు దేవేందర్ రెడ్డి

నిడమనూరు : నాగార్జునసాగర్ నియోజకర్గంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుల కుమారులు కొత్తగా రాజకీయాల్లోకి వస్తున్నారు. వీరు కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జయవీర్‌రెడ్డికి ప్రచారంలో అగ్రభాగాన నిలిచారు. సీనియర్ నాయకుడు యడవెల్లి రంగశాయిరెడ్డి కుమారుడు యడవెల్లి వల్లభ్‌రెడ్డి, నిడమనూరుకు చెందిన మేరెడ్డి వెంకట్రాహుల్ కుమారుడు మేరెడ్డి వివేక్‌కృష్ణ, నిడమనూరు సర్పంచ్ మేరెడ్డి పుష్పలత కుమారుడు శ్రీనివాసరెడ్డి కుమారుడు మేరెడ్డి వెంకట్, కుందూరు లక్ష్మారెడ్డి కుమారుడు దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు మాజీ ఎంపీపీ చేకూర హన్మంతరావు కుమారుడు చేకూరి శశిచరణ్ కాంగ్రెస్‌లో చేరి జయవీర్ తరపున విస్తృత ప్రచారం ఇర్వహించారు. నిడమనూరుకు చెందిన మేరెడ్డి వెంకట్ అమెరికా నుంచి, కుందూరు దేవేందర్‌రెడ్డి కెనడా నుంచి వచ్చి మరీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనుముల మండలం ఇబ్రహీంపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత యడవెల్లి నరేందర్‌రెడ్డి కుమారుడు వంశీకృష్ణారెడ్డి సైతం జయవీర్‌రెడ్డి గెలుపు కోసం పనిచేశారు. మేరెడ్డి వెంకట్రాహుల్ కుమారుడు మేరెడ్డి వివేక్‌కృష్ణ ప్రచారంలో ఎంతో కలివిడిగా ప్రజలతో మమేకమయ్యాడు. కొన్ని గ్రామాల్లో ఓటర్లు కుందూరు జానారెడ్డి కుమారుడు ఎవరు, ఏడీ అని అడిగిన వారికి వారిని వాహనం వద్దకు తీసుకెళ్లి ఇతనే కుందూరు జయవీర్‌రెడ్డి అని చెప్పి పరిచయం చేశాడు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అంకతి సత్యం కూడా దివంగత సీనియర్ నేత అంకతి వెంకటయ్య కుమారుడే, మండల యూత్ అధ్యక్షుడు నర్సింగ్ విజయ్ కుమార్‌గౌడ్ కూడా సీనియర్ నాయకుడు నర్సింగ్ కృష్ణయ్య కుమారుడే కావడం గమనార్హం. యువ రక్తంతో కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో ఆకట్టుకున్నారు. ఆదివారం వెలడే ఫలితాలపై వీరి ప్రభావం ఎంత ఉంటుందో వేచి చూడాల్సిందే.



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న భక్తులు

ఘనంగా అయ్యప్ప పడిపూజ

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో శనివారం అయ్యప్ప పడి పూజ ఘనంగా నిర్వహించారు. హరిహర భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అయ్యప్ప భజనలు, పాటలు ఆలపించారు. కంచర్ల భూపాల్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, రఘుపతి, టీఎన్‌జీఓ నాయకులు పందిరి వెంకటేశ్వర్లు, శ్రవణ్‌కుమార్, అక్కయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ గడ్డపై ఎగిరేది గులాబీ జెండానే..





ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కంచర్ల భూపాల్‌రెడ్డి, హాజరైన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు

- బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: నల్లగొండ గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం నల్లగొండ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. టికెట్లు అమ్ముకొని ఖర్చు పెట్టిన కోమటిరెడ్డిపై తాను 10 వేల మెజార్టీతో గెలుస్తానని తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ చూసి కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దన్నారు. వెన్నుపోటు నాయకుల వల్ల మెజార్టీ తగ్గుతుందేమోనని, లేదంటే 25 వేల మెజార్టీతో గెలుపొందేవాడినని చెప్పారు. 2018లో సర్వేలన్నీ బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా వచ్చాయని, అయినా అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకుడు చకిలం అనిల్‌కుమార్ మాట్లాడుతూ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని కాపాడే నాయకుడు భూపాల్‌రెడ్డి అని అన్నారు. కార్యకర్తల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, చీర పంకజ్‌యాదవ్, నిరంజన్‌వలీ, కటికం సత్తయ్యగౌడ్, తండు సైదులుగౌడ్, బొర్ర సుధాకర్, అభిమన్యు శ్రీనివాస్, సుంకరి మల్లేష్‌గౌడ్, నవీన్, రామ్మోహన్, ఫరూదుద్దీన్, వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

రహదారులు అధ్వానం



శివన్నగూడ- ఇందుర్తి గ్రామాల మధ్య దెబ్బతిన్న రోడ్డు

- కంకర తేలి, గుంతలమయంగా మారిన రోడ్లు
- వాహనదారులకు తప్పని తిప్పలు

మర్రిగూడ: మర్రిగూడ మండలంలోని 18 గ్రామపంచాయతీలు, వాటి పరిధిలోని ఆవాస ప్రాంతాల్లోని బీటీరోడ్లు అధ్వానంగా మారాయి. 2015- 16లో ఈ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేశారు. ఐదు సంవత్సరాలలోపు ఎక్కడా చెడిపోయినా ప్యాచ్ వర్క్ చేయాల్సి ఉంటుంది. కాని అవి నామమాత్రంగా చేశారు. ఈ రహదారులు కంకరతేలి గుంతలమయంగా మారడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికితోడు మూలమలుపులు, వంతెనల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

పట్టణ ప్రాంతాలకు వెళ్లాలంటే..
మండల ప్రజలు నల్లగొండ జిల్లా కేంద్రానికి ప్రయాణం చేయాలంటే శివన్నగూడ నుంచి తేరటప‌ల్లి మీదుగా కాస్త దూరం తగ్గుతుంది. సమీప దారి అయిన శివన్నగూడ నుంచి ఇందుర్తి, కొట్టాల, నామాపురం మీదుగా చండూరు మండలం తేరట్‌పల్లి, కమ్మగూడ, కొండాపూరం, చొల్లేడు, మునుగోడు నుంచి కొనసాగిస్తుంటారు. ఈ దారి పూర్తిగా ధ్వంసమైంది. ఈ దారి నుంచి 7 నుంచి 9 కి.మీ మేర ప్రయాణం చేయాలంటే ప్రాణసంకటంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు.



చర్లగూడెం- వెంకేపల్లి రోడ్డులో ఏర్పడిన గుంత

రోడ్ల నిర్మాణాలకు నివేదికలు..
శివన్నగూడ- నామాపురం 7కిలోమీటర్ల, శివన్నగూడ- అంతంపేట 4.60కి.మీ, లెంకలపల్లి నుంచి భీమ్లాతండా వరకు 5.50కిలోమీటర్లు, రాంరెడ్డిపల్లి- సరంపేట తండా 3.70కి.మీ, కమ్మగూడెం - వట్టిపల్లి కొత్తకాలనీ వరకు 7.75 కిలోమీటర్లు, మర్రిగూడ- పడమటితండా 4కి.మీ, కుదబాక్షపల్లి- వెంకేపల్లి 2.10కి.మీ, శివన్నగూడ - నర్సిరెడ్డిగూడెం 2.15కి.మీ, కొండూరు ఎక్స్‌రోడ్డు -ఏరుగుండ్లపల్లి 3.10కి.మీ, రాజాపేట - వెంకేపల్లి 9.30కి.మీ, చండూరు - తమ్మడపల్లి 0.85కి.మీ, ఏరుగండ్లపల్లి - మంతేన్‌గౌరెల్లితండా 4.95కి.మీ, సరంపేట - ఇందుర్తి 1.40కి.మీ, మర్రిగూడ- వట్టిపల్లి 2.23కి.మీ. ఇలా మొత్తం 62.50కి.మీ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా రూ.9.39కోట్లకు సంబంధించి నిర్మాణాలకు నివేదికలు తయారు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



మా ఊరి నుంచి మర్రిగూడకు వెళ్లాలంటే రోడ్డు బాగోలేదు. టిప్పర్లు అధికంగా నడవడం వల్ల గుంతలు ఎక్కువగా ఏర్పాడ్డాయి. వర్షం కురిస్తే ఎక్కడ గుంత ఉందో అర్థం కాకుండా ఉంది. ద్విచక్ర వాహనదారులు కిందపడి ప్రమాదాలు జరుగుతున్నాయి.

– ఏరుకొండ రాము, ఇందుర్తి

అనుమతి రావాల్సి ఉంది

మండంలోని అన్ని బీటీ రోడ్లకు సంబంధించి ఎన్ని కిలోమీటర్లు ఎంత వ్యయం అనేది నివేదికలు తయారు చేసి జిల్లా అధికారులకు పంపించాం. దానికి సంబంధించిన అనుమతుల్లో భాగంగా గుట్టప్పల్ మండలం తేరట్‌పల్లి- శివన్నగూడ వరకు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. నామాపురం వరకు పూర్తయ్యాయి. శివన్నగూడ వరకు పూర్తి కానున్నాయి. ఇతర గ్రామాలకు సంబంధించి కూడా పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

– యశ్వంత్, పీఆర్ ఏఈ